# 26

# రూపులమ్మ

# అడవిలో అక్కలు

## 1. రూపులమ్మ చేతిలో సూరీడు ఓడిపోయాడు

**1985.** అది మన్యం అడవి. అందులో ఒక గూడెం. ఆ గూడెం పేరు షోలాబు. అది కాకరపాడు దగ్గరలో ఉంటుంది. కాకి మార్గాన విశాఖకీ రాజమండ్రికీ దాదాపు సమాన దూరంలో ఉంటుంది షోలాబు. ఈ రెండు జిల్లాల అటవీ ప్రాంతాన్ని మన్యం అంటారు.

ఆ అడవిలో వేసవి వెన్నెల గుంకి చాలాసేపయిపోయింది. ఆకాశం నిర్మలంగా ఉంది. వెన్నెల ఉన్నంత సేపు మసగ్గా వున్న చుక్కలు ఆ చీకట్లో మిలమిలా మెరుస్తున్నాయి. గూడెం నిశ్శబ్దంగా నిద్రపోతోంది.

ఇంకా పూర్తిగా తెల్లవారలేదు. కొంచెం మసకమసగ్గా వుంది. ఎక్కడ్నుంచో పెద్దపెట్టున కలవరం వినిపించింది. తల్లులు ఒక్కసారిగా భయంతో లేచి కూర్చున్నారు. పాలు తాగే పిల్లలు కెవ్వుమని ఏడుపందుకున్నారు.

గంపలోకి పిల్లి చొచ్చినట్టుగా కోళ్ళు బెదిరి కెక్కెర కెక్కెర మంటున్నాయి. మంద మీద తోడేలు పడ్డట్టుగా మేకలు అరుస్తూ చంగలిస్తున్నాయి.

ఈ అల్లరికి ఒక్కపెట్టున పల్లె లేచింది. గూడెం మీదికి పులి వచ్చినంత తొక్కిసలాటగా వుంది. అరుపులు, కేకలు, నిద్రమొహాలతోనే గుడిసెల్లోంచి బయటకు పరుగుదీశారు. పిల్లలు బెదిరిపోయి తల్లులకు కరుచుపోయారు. ఏమి జరిగిందో ఎవరికీ తెలియదు. కొందరు భయంతో అడవికేసి పరుగుదీశారు.

ఒక్కసారిగా యిరుపక్కలా ఎవరో మీద పడ్డట్టయి గజ్జన భయపడి లేచింది రూపులమ్మ. క్షణంలో నిద్రమత్తు వదిలిపోయింది. కళ్ళు నలుముకుని చూసింది. పెద్దాడు అప్పుడు ఒకవేపు. చిన్నది బాలవ్వ ఒకవేపు తల్లిని వాటేసుకుని బిక్కచచ్చిపోయి చూస్తున్నారు. పక్కనున్న పెనిమిటికేసి చూసింది రూపులమ్మ.

పెనిమిటి మల్లుదొరకి ఇదేమి పట్టినట్టు లేదు. బుడ్డగోచి నగ్నంగా పక్కగోలుగా పడుకొన్నాడు. మగతలోనే మూలుగుతున్నాడు.

"లెగు లెగు" అంటూ చెయ్యేసి పిలిచింది రూపులమ్మ. పిల్లలు వెదురు చెలిపే ఎండలోని కత్తిని పట్టుకున్నట్టుగా చెయ్యి చురుక్కుమంది. అతను ఉలకలేదు పలకలేదు. జ్వరంతో నిద్రలోనే వణికిపోతున్నాడు. అతనీ లోకంలో లేడు. భయంతో బిగుసుకుపోయింది రూపులమ్మ. అవతల అరుపులు, కేకలు. ఏం చేయాలో పాలుపోలేదు. పిల్లలు తల్లికేసి, తండ్రికేసి పిల్లికూనల్లా బిక్కుబిక్కుమని చూస్తున్నారు.

రూపులమ్మ మనసు పరిపరివిధాల పోతోంది. కాకీ బట్టలు, కరుకుబూట్లు, లాఠీ, తుపాకీ మడుమల్తోబాదడం – పార్వతి ఒక్కదాన్నీ లాక్కుపోయి పదిమంది మంది తోడేళ్ళులాగా చీరుకుతినడం, రక్కడం, కొరకడం, అందరిముందే బట్టలూడదీయడం, ముట్టుకోసం పెట్టుకున్న పాతగుడ్డ పీకేయడం, ఒకరి తర్వాత ఒకరు పార్వతి మీద పడడం... ఆ దెబ్బ నుంచి గూడెం నెలదాకా కోలుకోలేక పోవడం ఒక్కసారిగా కళ్ళముందు కదలాడాయి.

అవి గుర్తొచ్చి మరింత వణికిపోయింది రూపులమ్మ. భర్తని ఎంత పిలిచినా పలకడం లేదు. అలా వున్న వాణ్ణి ఎలా వదిలేయడం? వదిలేసి ఎక్కడికని వురకడం? ఉరికితే వెంటపడరని మాత్రం ఏముంది? తమ రక్షణకి చోటంటూ ఏదైనా ఉంటే అది ఈ గుడిసె, గూడెమే. దాని గతే యిలా ఉంటే ఇంకెక్కడికని ఉరకడం. ఎక్కడైనా తమ బతుకంతా వాళ్ళ చేతుల్లో ఆగమాగమే.

చావు సమీపించినదాన్లా అలాగే వుండిపోయింది రూపులమ్మ. అంతా అయిపోయింతర్వాత జరిగిందేమిటో ఎవరికీ అర్థం కాలేదు. వాళ్ళు భయపడ్డట్టుగా కాకీ బట్టలు, కరుకుబూట్లు కన్పించలేదు. ఏమీ లేకుండా మరి పల్లెంతా ఎందుకు వులికిపడ్డట్టు? ఈ రోజు తెల్లవారు జూమున రాజులబాబు గుడిశలో తొల్త అలికిడైంది. అటకమీంచి అడ్డాకుల కట్ట మంచంలో పడుకున్న అతని భార్య పార్వతిమీద పడింది. పార్వతి ఆనాటి షాక్ నుంచి ఇంకా తేరుకోనేలేదు. కలపడ్డట్టయి భయంతో లేచి అరిచి కేకలు పెట్టింది. నిమిషంలో ఈ అల్లరంతా జరిగింది.

ఈ సంగతంతా తెలిసేసరికి సూరీడు తూరుపు కొండ మీద సగం సగం మొహంతో వెక్కిరింతగా యికిలించాడు. ఒకరినొకరు దెప్పుకున్నారు. నవ్వుకున్నారు.

రూపులమ్మ నీళ్ళకుండ తీసుకుని గెడ్డ (ఏరు) కేసి వడివడిగా నడవసాగింది. టకటకా బూట్ల చప్పుడు ఎక్కడినుంచో వినిపిస్తోంది. వంటరిగా నడుస్తుంటే మళ్ళీ పార్వతి మనస్సులో మెదిలి ఒళ్ళు జలదరిస్తోంది. చెట్టుచాటుకు తప్పుకుంది. ఆ శబ్దం వచ్చే వైపు చూసింది. సూర్యుని లేత కిరణాలు పచ్చటి చెట్ల మీద దోబూచులాడడం తప్ప ఏమీ కన్పించలేదు.

పొద్దున్నే మళ్ళీ వేట మొదలైందా ఏమి ? గుండె చిక్కబట్టుకుని అడుగులో అడుగువేసికొంటూ అటుకేసి నడిచింది. ఎవరో పిల్లల నవ్వులు విన్పించాయి.

చెట్టు చాటు నించి పొదచాటుకి నక్కింది. పొదచాటునించి కొంచెం ధైర్యం చేసి అటుకేసి చూసింది. బాలవ్వతో పాటు మరో ఇద్దరు పిల్లలు ఎక్కడో దొరికిన పాతబూటుని గుండురాయికేసి బాదుతున్నారు.

"ఆకులకే బయ్యంపడ్డారు. అసలోల్లచ్చినా ఆల్లని ఇట్లనే బండకేసి బాదకపోతే సూడు." ఓ కుర్రాడు బీరాలు పలుకుతూ నవ్వుతూ కసిగా బూటుని బాదుతున్నాడు. పిల్లలు కిలకిలా నవ్వారు. బాలవ్వ నవ్వు చూసి రూపులమ్మ మురిసిపోయింది. తల్లిపేగు అప్యాయతతో కదిలింది. మనస్సు కుదుటపడింది.

"హమ్మయ్య! పోలీసులు కాదన్నమాట!"

వాళ్ళనేదో చిరుకోపంతో మందలించబోయింది. అంతలోనే ఏదో గుర్తొచ్చింది. తేలికపడిన మనసుతో గెడ్డకేసి నడిచింది.

అప్పటికే చాలామంది స్నానాలు అయిపోయినట్టున్నాయి. నలుగురైదుగురు ఆడవాళ్ళు మాత్రం తీరిపారి స్నానం చేస్తున్నారు. పిల్లలు ఆ కొద్ది నీళ్ళధారలోనే అటూ యిటూ చేపలు పడుతున్న వాళ్ళలాగా ఆడుకుంటున్నారు.

అలా చీరమీదే రూపులమ్మ నీళ్ళు పోసుకుంది. ఒళ్ళంతా రుద్దుకుంది. ఎండకి నల్లబడ్డ బక్కపలచని శరీరం నునుపు దేరి మెరుస్తోంది. పొడిచీర చుట్టుకుని కొంగు నడుముకి చుట్టుకుని నీళ్ళతో బరువుగా పల్లెకేసి నడిచింది.

అప్పటికి పొయ్యిలో కట్టెలు మండి వూరుకున్నాయి. కొన్ని నిప్పులు మిగిలాయి. చోడి అంబలి ఇంకా తుకతుకమంటోంది. మూత తీసి కలిపిచూసి

దింపింది. నీళ్ళ కుండ పొయ్యి మీద పెట్టింది. రెండ్రోజుల క్రితం సంతలో తెచ్చుకున్న వంకాయల్ని తరుగుతూ కూర్చుంది. పెనిమిటి కేసి చూసింది.

అంత పొద్దయినా అలాగే ఆయాసంగా ఒరిగాడు మల్లుదొర. ఎందుకో మూలుగుతున్నాడు. అకస్మాత్తుగా ఎండుచేపలు దాచిన ఉట్టిమీదికి దృష్టి మళ్లింది.

ఎర్ర గండు చీమలు వెదురునార మందంగా ఉట్టికి ధారపడ్డాయి. గబగబ ఉట్టి విడిచి వాకిట్లో దులిపింది. అప్పటికే ఎండు చేపలు సగం బొర్రలైపోయాయి. అయ్యో అంటూ మనస్సు విలవిలలాడింది. చేపలంటే ఎంత ప్రేమో అంత నోటికి రాకుండా అయిపోయింది. ప్చ్ ......!

ఒక చేపముక్క విరిచి నోట్లో వేసుకుంది. చప్పరిస్తూ ఎవరేనా చూస్తున్నారేమోనని అటు యిటు చూసి, మరో రెండు గుటుక్కున నోట్లో వేసుకుంది. ఉట్టిని వేరొక వాసానికి వేలాడదీసింది. వంకాయలు తరుగుతూ బియ్యం కడగడానికి తడక వద్దకొచ్చింది. ఏదో జ్ఞప్తికి వచ్చినట్టుంది. ఏదో గొణుక్కుంది. కోపంగా అరిచింది.

"గుంటా ! బేగి ఇటురాయే !"

రూపులమ్మ గొంతు రాచిలక గొంతులా ఉంటుంది. ఆ కోపంతో మైనా గొంతులా కీచుమంది. ఆ కేకతో పరుగుపరుగున వచ్చింది బాలవ్వ. వచ్చి దించిన అంబలి కుండ కేసి ఆశగా చూస్తోంది.

"మీ నాయనను లేపు. ఉడుకునీల్లు పోసుకోమను"

నీళ్ళ కుండ దించి బియ్యంగిన్నె పొయ్యిమీద ఉంచింది తల్లి. బాలవ్వకు ఆ మాటలు వినిపించినట్టులేదు. ఏదో వాసన వస్తున్న తల్లి నోటికేసి చూస్తోంది. చాపల ఉట్టికేసి చూసింది. అది స్థలం మారడం గమనించింది.

"ఊం! ఊం!" గారాబం పోయింది కూతురు.

"ఊం! పట్టు" అని విరచి ఓ చిన్న చేపముక్క చేతిలో పెట్టింది తల్లి.

నీళ్ళ కుండ తడిక వద్దకు తీసుకపోయింది రూపులమ్మ. పెనిమిటి వస్తాడేమోనని అక్కడే నిలిబడింది. కాని వస్తున్న అలికిడేమీ లేదు. అక్కడి నుంచే కేక వేసింది.

"కూడు పాడవుద్ది. బేగిరా తానం బోత్త."

ఆ మాటకు చీమకుట్టినట్టయినా లేదు మగనికి. విసుగ్గా గొణుక్కుని మగని మంచం సమీపించింది. మల్లుదొర రెక్కపుచ్చుకుంది. ఆ ఒళ్ళంతా చలిజ్వరంతో సలసల కాగుతోంది.

"బేగిలే"

అంటూ తడిక వేపు నడిపించింది రూపులమ్మ. రాయి మీద కూచోబెట్టి నీళ్ళు పోసి రుద్దింది. కింద పెట్టిన కూడు జ్ఞాపకమొచ్చింది.

"గుంటా! కూడు సూడే కుక్కగిన ముట్టగలదు."

మల్లుదొర ఒళ్ళు తుడుచుకుని బుడ్డగోచి కట్టుకున్నాడు. అప్పటికి ఒళ్ళు బరువు కొంచెం తగ్గినట్టుంది. మెల్లగా నడిచి మంచం మీద కూర్చున్నాడు.

వంకాయ పోపు వేస్తోంది రూపులమ్మ. ఆకలి అంటూ కొడుకు అప్పుడు పరిగెత్తుకుంటూ వచ్చాడు. ఉదయం నుంచి గొడ్లను మందవేసి అడవికి వెళ్ళ డానికి సద్దికోసం వచ్చినట్టున్నాడు. కమ్మటి పోపు వాసనకి ముక్కు ఎగబీల్చాడు వాడు.

అల్యూమీనియం గిన్నెల్లో తలాయింత అంబలి పోసింది తల్లి. అంబలి లోకి అన్నం కావాలన్నట్టుగా కొడుకు అన్నం గిన్నె కేసి ఆశగాచూస్తూ తల్లివేపు చూశాడు.

"అది ఇప్పుడు గాదు. అప్పటికి, సద్దికి."

తల్లి కళ్ళు పెద్దవి చేసి కొడుకును మందలించింది.

ఉడుకు గంజి తాగాక పోయిన బలం వచ్చినట్టయింది మల్లుదొరకి. నోటి నిండా త్రేవుమన్నాడు. మూలకున్న గొడ్డలి తీసుకుని పదును చూశాడు. ఫర్లేదు బాగానే వుందన్నట్లుగా తలూపుకున్నాడు.

అప్పటికే ఎండ వూపందుకుంది. అందరికన్నా ఆలస్యంగా తయారై పనికి వెళుతున్న పార్వతి "అత్తారేటి ?" అంటూ గుడిశలోకి తొంగిచూసింది. అక్కడే ఆగిన భార్యని గమనించకుండా రాజులబాబు వడివడిగా ముందుకు నడుస్తున్నాడు. పెనిమిటి దూరం కావడం చూసి వెంట పరిగెత్తింది పార్వతి. "నే ఎల్తా బేగిరా" అని రూపులమ్మను కేకేసింది. మొన్నే సంతలో వేయించుకున్న పార్వతి గాజులు గలగలమంటున్నాయి.

ఉదయం జరిగిన గొడవవల్ల ఈ రోజు పనికెళ్ళడం అందరికీ ఆలస్యమై పోయింది. అప్పటికి అందరూ వెళ్ళిపోయారు. పిల్లలు గుడిసెల ముందర ఆటల్లో పడ్డారు. రూపులమ్మ తొందరపెడుతోంది. ఉడికీ ఉడకని వంకాయ వేసేసి చద్దికట్టేసింది. కొడుకు చేతికర్రని భుజం మీద వేలాడేసుకున్నాడు. దానికి సద్ది తగిలించుకుని హుషారుగా ముందుకేసి పరుగుదీశాడు.

స్నానం చేసిన మల్లుదొర వళ్ళు నల్లగా మెరుస్తోంది.

పాత తువ్వాలు తీసుకుని ఎడం భుజం మీద వేసుకున్నాడు. గొడ్డల్ని కుడి భుజాన వేసుకుని బయట నిలబడి అటూ యిటూ చూశాడు. పెద్దవాళ్ళెవ్వరూ కన్పించలేదు.

"ఊఁ పద" అన్నట్లుగా భార్యకేసి చూశాడు.

రూపులమ్మ సద్ది కట్టడం పూర్తయినట్టుంది. వంట గిన్నెల్ని వుట్టిలో పెడుతోంది. నా కన్నం అన్నట్టుగా తల్లికేసి చూసింది బాలవ్వ. తల్లి కసురుకుంది.

"ఇంటికాడే ఉంటావు గద! జాం పొద్దెక్కినంక తిందువులే".

మల్లుదొర తోవసాగాడు. చేతులు కడుక్కుని తన కత్తి గొడ్డలీ తీసుకుని ఆ వెనుకే గబగబా నడిచింది రూపులమ్మ. పదడుగులు వేసిందో లేదో "గుంటా ! ఇల్లు జాగర్త" అంటూ వెనక్కి తిరిగి కేకేసింది.

మల్లుదొర కాసెగడ్డిలో అటూయిటూ తోవ పాపుకుంటూ వడివడిగా నడుస్తున్నాడు. ఆ వెనుకే గలగలమని రూపులమ్మ గాజుల సవ్వడి వినిపిస్తోంది.

ఆ కాసెగడ్డి రెండు నిలువుల ఎత్తుదాకా పెరిగింది. ఆ గడ్డిలో వాళ్ళ అలికిడికి ఏదో సరసర పరిగెడుతోంది. తోవ పాపుతున్న గడ్డి సర్రుసర్రున అదోరకమైన సవ్వడి చేస్తూవుంది. నడుస్తున్నంత వేగంగా రూపులమ్మ ఆలోచనలు సాగుతున్నాయి.

గాలి బాగా వీస్తున్నట్టుంది. గాలి వీచిన దిక్కల్లా గడ్డి సోలుపుగా వయ్యారంగా సాగిపోతుంది. సిరిమానులు జువుకు జువుకున ఉయ్యాలలూగుతున్నాయి. ఎక్కడో ఏదో జంతువు బాక్‌బాక్‌మంటూ అరుస్తూ వుంది.

ఇవన్నీ వాళ్ళకి అలవాటే. అందుకే వాటిని గూర్చి ఆ అలికిడి గురించి

రూపులమ్మ ఆలోచించడం లేదు. ఆలస్యం గురించి ఆలోచిస్తూ వుంది. పొద్దున జరిగింది తలపుకొచ్చి నవ్వుకుంటోంది. ఉత్త పుణ్యానికి తాను ఎంత భయపడి పోయింది. తాను పుట్టి బుద్దెరిగిన్నుంచి ఇంతగా ఎన్నడూ భయపడలేదు. పెనిమిటి జ్వరంతో మూలుగుతుండడం ఆ పార్వతిని ఆగం ఆగం చేసిన వైనము పోలీసోల్లంటేనే భయంతో వెన్నుపూస వణకడమూ - అన్నీ కలిసి అంతపని చేశాయి. ఈయనకి జ్వరం వల్ల బయల్దేరడం మరింత ఆలస్యమయిపోయింది.

ఈ వారం కూలి గిడుతుందో లేదో! మొన్న రెండు పూటల పనిపోయింది. ఈ పూట ఎలా ఉంటాడో, ఆ జ్వరం ఏంచేస్తుందో తెలియదు. అన్నలు రాక చాలా రోజులయిపోయింది. అన్నలొచ్చి మందులిచ్చేదాకా తమకీ పల్లెలో మందులిచ్చే వాళ్ళెవరున్నారని ? సూపర్‌వైజర్ రెండు బిళ్ళలను యిచ్చాడు గాని తగ్గలేదు. ఈ జ్వరం మా చెడ్డ జ్వరం. ఇది ఎవరికీ లొంగదు. ఇది తన చెల్లితో పాటు ఎంత మందిని తీసుకుపోయిందో లెక్కలేదు. అన్నలొచ్చాక ఈ జ్వరం భయపడడం మొదలైంది. అందుకే అన్నలు యిట్లా బిళ్ళలివ్వగానే అట్లా తగ్గిపోయింది. అన్నలు ఎపుడొస్తారో ఏమో! అంతదాకా ఈయన ఎంత తిప్పలు పడతాడో పాపం...

దొంగలొద్ది ఇంకా కూతవేటు దూరంలో వుంది. ఆ కాస్త నడకకే అలసి పోయాడు మల్లుదొర. సిందుగు చెట్టు నీడ కన్పడ్డంతో ఒగరుస్తూ అక్కడే నిలబడిపోయాడు. ఆ వెనుక రూపులమ్మ యింతలో ఏమైందని ఆశ్చర్యపోయింది. అతను పెద్ద పెద్ద అంగలేసేవాడు. ఆమడ దూరం అవలీలగా నడిచేవాడు. ఇంకా సగం దూరమైనా చేరలేదు.

వాళ్ళు వెదురు నరకడానికి వెళ్ళే కూపు దూరాన వుంటుంది. వాళ్ళ గూడెం దరిదాపుల్లో రెండు కూపులున్నాయి. కాని ఆ గూడెం వాళ్ళంతా ఆ దూరానికే నడిచి వెళ్ళివస్తుంటారు. ఆ కూపు సూపర్‌నైజర్ కొంచెం మంచివాడు. అడగ్గానే వందైనా అడ్వాన్సుగా ఇచ్చేస్తాడు. దూరం నుంచి వస్తున్నారని కూలికి తోడు తలా రోజొక రూపాయి ఎక్కువిస్తాడు కూడా. ఆ రూపాయి కోసం ఇటూ వాళ్ళు అటూ, అటు వాళ్ళు యిటూ కూపుల్లోకి వెళుతుంటారు. అంత దూరం వొద్దని బాలవ్వ పసిపిల్లగా వున్నపుడు శతపోరింది రూపులమ్మ. ససేమిరా అన్నాడు మల్లుదొర. అంత దూరం వద్దనడం ఇపుడు మల్లుదొర వంతయింది.

ఎండకు నొసటినుండి కారుతున్న చెమటను చేత్తో విదిలించి నొసలు చిట్లించింది రూపులమ్మ. గాజుల సవ్వడికి ఉలిక్కిపడ్డ ఆ సిందుగు చెట్టు మీది మైనా రివ్వుని ఎగిరిపోయింది. రూపులమ్మ భావాలేవీ గమనించదలుచుకోలేదు మల్లుదొర. మళ్ళీ జ్వరం పోటెక్కుతున్నట్టుగా వుంది. చెయ్యి నడుంకి ఆన్చి అక్కడే ఆగిపోయేవానిలా నిలబడి అటుకేసి చూశాడు.

ఆ మైనా ఎండ భరించలేనట్టుగా తెల్ల మద్దిచెట్టుకేసి పరుగుతీసింది. తెల్లమద్ది చెట్టు మీది నుండి ఏదో పిట్ట ఎగిరి గానుగ చెట్టు కేసి పారిపోయింది.

ఆ వైపంతా మంచం నులకకోసం, గుడిసె కప్పుల కోసం కాసెగడ్డి కోసేశారు. అంతా బయలు బయలైపోయింది. తెల్ల మద్దిచెట్టు బెరడు ఎండిపోయి రూపులమ్మ కంటె బొక్కలా (ఎముకల్లా) పైకి తేలి కనిపిస్తోంది.

ఆ బెరడు ఎంత బావుంది! అటు చూడమన్నట్టుగా భార్యకేసి చూశాడు మల్లుదొర. ఎందుకు చూడమంటున్నాడో తెలుస్తూనే వుంది రూపులమ్మకు. ఆ బెరడు టీ పొడులా వాడుకోవచ్చుని ఆశ. కాని ఇప్పటికే ఆలస్యమయింది.

“ఆ బెరడు టీ సేసుకుని తాగుతే జొరం తగ్గుద్దా ? ఆ సూపరొయిజరు బాబుగార్ని మల్లి అడిగయినా సీటి రాయంచుకొమ్మంటె ఉహూఁ అంటివి. సీటి తెత్తె అప్పుడు కాకరపాడెల్లి బిల్లలు కొనుక్కొచ్చే ఓడు గదా!”

గాలి కూడా వేడెక్కుతోంది. వేడిగాలి రివ్వున వీస్తోంది. ఆ తెల్ల మద్ది పక్కనే వున్న టేకు చెట్టు మీంచి కౌంజు పిట్ట రయ్యిన ఎగిరిపోయింది. తమకలా చెరో రెండు రెక్కలుంటే ఎంత బాగుండుననుకుంది రూపులమ్మ. ఈ సరికి అక్కడ రెండు వెదురు పొదలు నరికి కుప్పేసేవాళ్ళు.

పాల కొడిసె చెట్టు మీంచి ఎగిరి నేలవాలిన నెమలిలా వయ్యారంగా రెండు అడుగులు ముందుకేసింది రూపులమ్మ.

“ఆల్లిచ్చే మందుల్తోటి తగ్గుద్దేటి? డబ్బు దండగ ....... ప్చ్ ఆ అన్నలొత్తే ఎంత బావుండేది. ఆ అన్నలత్తే యిట్టే సనంలో తగ్గిపోద్ది జొరం. ఎపుడొత్తారో ఏమో” ఆకాశంకేసి అదో విధంగా చూశాడు మల్లుదొర.

పని ఆలస్యమైంది. అటెండెన్సు రిజిస్టరు మూసేత్తారేమోనని తొందరగా వుంది రూపులమ్మకి. కోపంగా అంది.

"ఈ సెట్టు సెక్కలై సిప్పుయార్డుకెల్లి సముద్రం సేరినాక అత్తరు. ఆల్లచ్చేదాక యిల్లాగే ఊరుకుంటె ఈ పని ఎలా అవుద్దేటి?"

"అలాగంటావేటే? అన్నలు అంత కనికరం లేనోల్లు కాదె. ఈ పాటికి నాను ఆల్ల కలలోకొచ్చి ఉంతాను. రేపోమాపో అచ్చేత్తరు. నాకు నమ్మకముందే."

"పొద్దెక్కి పోనాది, మస్తరు పోతాది, లెగు" – విసుగ్గా తలగోక్కొని గబగబా ముందుకు సాగింది రూపులమ్మ.

"మనం మాత్తరం మడుసులం కావేంటి? ఆడు మూడ్రోజులు తేలుకుట్టిందని ఇంట్లో తొంగోలేదా?"

ఆ మాటన్నా ఫలితం లేకపోయింది. అప్పటికి స్పీడందుకుంది రూపులమ్మ ఉస్సురంటూ అనుసరించాడు మల్లుదొర.

ఎండ దంచుతోంది. రూపులమ్మ ఆలోచనలు చిక్కబడుతున్నాయి. ఈ అన్నలొచ్చిన్నించి ఎన్ని కొత్త సంగతులు తెలిశాయి. దాంతో పాటు కొత్త కష్టాలు మొదలయ్యాయి. కూలి పెరిగిందన్న మాటే గాని కంటి మీద కునుకు లేకుండా పోయింది. ఎప్పుడు ఎవరొచ్చి తంతరో తెలియదు. తను ముందే పిరికిది. ఇంత ఎండాకాలంలోనూ గుడిశ దాటి వాకిట్లో పడుకోదు. ఈయన చూడబోతే యిలా. పెద్దోడు ఎవతినన్న ఏలుపట్టుకుని తీసుకొస్తే ఎంత బాగుండు. వాడు తన నడుంకన్నా ఎత్తెదిగాడు. ఎంత చెప్పినా వానికి తోచదు. ఎవతినన్నా పెద్దదాన్ని తీసుకొస్తే తమతో పాటు అది కూడా బొంగు నరికితే ఎంత ఆసరా! ప్చ్!

అప్పడికి పన్నెండేళ్ళుంటాయి. అప్పుడే రూపులమ్మకి ఎన్ని ఆశలో. మొన్నటి సంతలో గాజులుకొని యియ్యరా అంటే వాడు బొంబాయి మిఠాయి కొనుక్కుతిన్నాడు. వాడికి ఎప్పుడు బుద్ధి వస్తుందో. సంతంటే గుర్తొచ్చింది. ఈసారి బట్వాడాతో మళ్ళీ బియ్యం కొనుక్కోవాలి. గుంటడికి అంగీ నిక్కరు కుట్టించాలి. తానొక రోల్డుగోల్డు చెవి కమ్మలు కొనుక్కోవాలి. పెనిమిటి మందులు కొనాలి. అన్నలొస్తే చేయడానికి ఇంట్లో టీ పొడి లేదు. వాల్ల కోసమన్నా కొనాలి.

అన్నలంటే గుర్తొచ్చింది. వాళ్ళెక్కడున్నారో, ఎలా ఉన్నారో పాపం. ఈ అన్నలు ఎంత మంచోల్లు. వీల్లు రావడం మొదలయ్యాక తమకు మందుల ఖర్చే లేకుండా పోయింది. అంతకు ముందు సగం డబ్బు మందులకే ఖర్చయ్యేది.

అన్నలు వచ్చాకే లాట్ల కూలీ, డ్రాగింగ్ కూలీ పెరిగింది. ఓ సారి నెలా, ఓ సారి రెన్నెల్లు సమ్మె చేశారు తాము. పేపరు మిల్లోడు దిగిరాలేదు. పోలీసుల్ని పంపాడు. గూడాలన్నీ బెగ్గం పాడు చేశారు వాళ్ళు. దాంతో వాడి లారీలు కాలి కూలాయి.

అన్నల భయంతోనే ఇప్పుడు సూపరు వైజరు మర్యాదగా మాట్లాడుతున్నాడు. ఫారెస్టోల్లు కూడా వొళ్ళు దగ్గర పెట్టుకుంటున్నారు. అంతకు ముందు అయిదెకరాల మెట్టకే రెండొందలు లాగేవాళ్ళు. మేక పుల్లర అయిదు. కొత్త గుడిశ వేస్తే ఒక కోడి, యాభై రూపాయలూ మెక్కేవాళ్ళు. అన్నీ తిని ఫారెస్టు కొట్టారని, ఫారెస్టు భూమి దున్నారనీ కేసుల్లో ఇరికించేవాళ్ళు. దండుగలు పిండేవాళ్ళు. అన్నల్రావడంతో ఎంత మారిపోయిందో!

ఆలోచనల్తో వేగంగా నడుస్తోంది రూపులమ్మ. వాళ్ళు దొంగలొద్ది దాటారు. చెమటలు కక్కుతున్నారు. తలలోంచి ఉప్పు చెమట కంట్లోకి కారుతోంది. అయినా అది తుడుచుకునే ఓపిక లేదు. మల్లుదొర కళ్ళు మంటెత్తిపోతున్నాయి. గొడ్డలి బరువయినట్టయి భుజం మార్చుకున్నాడు. ఎండ దంచికొడుతున్నది. కాసెగడ్డికి ఇది వెన్నెల్లాగుందేమో, వేడిగాలే పిల్లగాలై కన్నెపిల్లలా వంగిపోతోంది. తలుపు చాటు నవ్వులా సవ్వడి చేస్తూంది.

ఎన్నడూ లేంది అరిపాదాలు నెప్పులెడుతున్నాయి మల్లుదొరకి.

అతనికి అంగి తొడుక్కోవడం తెలియదు. జీవితంలో చెప్పులు తొడిగి ఎరుగడు. పగుళ్ళుబారి నెర్రెలిచ్చి దుమ్మునిండిన మడిమలు సలుపుతున్నాయి. గడ్డి సూదుల్లా గుచ్చుకుంటున్న బాధ. కాలుదీసి కాలు వేయడానికి ప్రాణం విలవిలలాడుతోంది. వొళ్ళు సలసల కాగుతోంది. వేడి భరించరాకుండా వుంది.

వెనక్కి తిరిగి చూస్తే ఎక్కడ ఆగిపోతాడోనని భయం. వేగంగా పెద్దపెద్ద అంగలేస్తూ వుంది. నెర్రెలిచ్చిన కర్ర చెక్కల్లా వున్నాయి రూపులమ్మ కాళ్ళు. ఆ కాసెగడ్డి కోసుకుపోవడం మాట అటుంచి ఆ అదురుకి కీచుకీచుమని అరుస్తూంది. అరవక! అని మట్టెలు మొట్టికాయలేస్తున్నాయి.

ఏదో గీరుకుపోయి నెత్తి గీరుకున్నాడు మల్లుదొర. తల వెంట్రుకలు వేడెక్కి పెనంలా తగిలాయి. కాళ్ళలో ఆసరా తగ్గిపోయింది. కూలబడదామని చూశాడు. కేకేసినా అందనంత ముందుకెళ్ళిపోయింది రూపులమ్మ.

"దొంగముండ! యివాల నా పానం దీత్తోంది."

దూరం దగ్గరవుతున్నకొద్దీ ఆలోచనలు కట్టేసింది రూపులమ్మ. వెళ్ళాల్సిన కూపుకేసి చెవి ఒగ్గి నడుస్తూంది. పద్రుద్రున వెదురు బొంగులు విరిగిపడుతున్న శబ్దం నాగస్వరంలా వినిపిస్తూంది. తోవ కిరువైపులా వున్న వెదురు పొదలు ఆ సంగీతానికి నాట్యం చేస్తూ ఈలలు వేస్తున్నాయి. అలసట తగ్గి రూపులమ్మలో ఉత్సాహం పుట్టుకొచ్చింది. దళంలోని అక్క నేర్పిన ఏదో పాట చప్పరిస్తూ తోవ మలుపులు తిరుగుతోంది.

ఎండకీ ఆయాసానికి తాళలేక మల్లుదొర పనసచెట్టు నీడన కూలబడి పోయాడు. బాగా దాహంగా వుంది. శరీరం లోంచి వేడి ఆవిర్లొస్తున్నాయి. తల గిర్రున తిరుగుతున్నట్లుగా వుంది. బాధగా మూలిగాడు. డొక్క నొప్పి లేచి కడుపు పట్టుకుని అటూ ఇటూ పొర్లాడు. అతని పక్కనే ఉన్న గువ్వల జంట భయంగా గునగునా కొండచీపురు పొదల్లోకి దూరిపోయింది. గుమ్మడి చెట్టు కింద వూసులాడుతున్న ఉడుతల జంట చటుక్కున పనస చెట్టెక్కింది.

రూపులమ్మ వెనక్కి తిరిగి చూసింది. మల్లుదొర అలికిడే లేదు. మళ్ళీ విసుక్కుంది. ఈ రోజు నడక మరీ యిద్దెం అయిపోయింది. ఈ రోజు బయల్దేరిన యాల్లకైనా సరిగ్గా నడిస్తే ఈపాటికి రెండు పొదలైనా తెగిపడేవి. ప్చ్! ఈ సీజను లోనే కొద్దిగా అయినా సంపాదించుకోవాలి. ఇంకొద్ది రోజులు పోతే వర్షాకాలం వచ్చేస్తుంది. ఈ ఎండకు మరణకాలం రాను. ఏం ఎండ, ప్చ్, వర్షాకాలం వస్తే ఇక మళ్ళీ తిండికి తిప్పలే. మూడు పూటలా అంబలే తాగాలి. ఈసారి ఖర్చులన్నీ పోగా రెండొందలేనా కూడబెట్టుకోకపోతే మల్లా అప్పులకోసం ఉరకాల. యాభై రూపాయలు! ముద్దకు ముద్ద! వాల్ల సావుగాను ఎత్తుకుపోనారు మల్లా ఏనాటికి కూడేను అంత డబ్బు. ప్చ్!

ఆగకుండానే సిందుగు లొద్దిలో ప్రవేశించింది రూపులమ్మ.

ఊడిగ కంపలోకి ఏదో పురుగు గబగబా పరిగెడుతోంది. తన అలికిడి వింటేనే అందరికీ అంత హడలు. కాని సూపరొజరుగాడున్నాడే! ఆని కల్లు కాట్నంలో బెట్ట అలా సూత్తాడేటి, ఓనాడు పెయ్యంత నొప్పుల్తోటి ఏడుత్తున్న పార్వతి చేయిపట్టుకున్నాడు. ఈసరి అలా జరగనీ, అన్నలకు చెప్పి తన్నించకపోతే తానెవతి. మొన్నటిసారి అయిదు రూపాయలు తక్కో ఇచ్చినాడు. లెక్క

తెలీదనుకున్నాడో దొంగనంజా కొడుకు. ఇప్పుడు అన్నలొచ్చాక అణిగారు గానీ ఇంతకు ముందు ఎంత సేసేవోరు అమ్మో. ఈల్లకి నిజంగా అన్నలే మిండలు. ఈపూట మస్తరెయ్యనంటే అన్నలొచ్చాక చెప్తానా ఇంకేమైనా చేయిత్తానా! ఏటనుకుంటున్నాడో మస్తరు ఏయకపోవడం ఆడి బాబు అక్కేటి? చేసినంతేగా వాడిచ్చే కూలీ. మరి ఎందుకెయ్యడంటా మస్తరు. అప్పుడు ఎదగనీ. ఆడు తుపాకి పట్టడం నేర్చుకుంటాడుగా అప్పుడు గందా వీల్ల సంగతి.

బొంగులు నరుకుతున్న శబ్దం రెండు వైపులా మరీ దగ్గరగా వినిపిస్తూ వుంది. నెత్తి మీద పడ్డ దుమ్ము దులుపుకుంటూ – మొహం మీద చెమటలు తుడుచుకుంటూ – బొడ్లో కత్తి తన వంటి వేడిలో కలిసిపోయింది, వుందో లేదో సరిచూసుకుంది. గొడ్డలి భుజం మార్చుకుంది.

రూపులమ్మ పని చేసే ఏరియా దగ్గరపడింది. గబగబా కొండ ఎక్కుతోంది. కాళ్ళు ఆ పొదల్లో చీరుకుపోతున్నాయి. రాళ్ళు ఒరుసుకుపోతున్నాయి. అయినా అలవాటుగా కొండ ఎక్కుతోంది. చెవుల కిరువైపులా పొదరద్దినట్టుగా ఉప్పుతేలి తెల్లగా మెరుస్తుంది రూపులమ్మ. నూనెలా జిడ్డుగా చెమటలు కారుతున్నాయి.

ఎండ పక్కన బొంగు నరుకుతున్న వాళ్ళకేసి చూసింది. అది పార్వతి వాళ్లు పనిచేస్తున్న పొద. వాళ్లు తమకన్నా పావుగంట ముందుగా బయల్దేరారో లేదో! అప్పుడే రెండు పొదల వెదురు నరికి కూప్పేశారు. పార్వతి కత్తితో వెదురు బొంగుల పిల్లలని (చిన్న పొరకల్ని) సిలపడం చేస్తూంది. రాజులబాబు రెండు దెబ్బలకో బొంగు పడగొట్టేస్తున్నాడు.

కొండ పైదాకా ఎక్కివచ్చి ఎనక్కి తిరిగి చూసింది రూపులమ్మ. మల్లుదొర కనిపించలేదు. వస్తుంటాడులే అని ముకద్దమ్ ఉన్న వేపు నడిచింది. మస్తరు వేయించుకుని తమ పని స్థలం వేపు తిరిగింది. ఇంకా మల్లుదొర జాడలేదు.

నిన్న మిగిలిపోయిన బొంగుల్ని సిలపడం మొదలుపెట్టింది.

మెల్లిగా చేరవచ్చాడు మల్లుదొర. అతని చూపుల్లో కోపం ఉంది. ముండా – నేను చచ్చినా నీకు కనికరం వుండదే. నిన్ను డబ్బు పిశాచం పట్టుకున్నదే. గొడ్డలి కింద పడేసి ఆయాసంగా ఒగరుస్తు కూర్చున్నాడు మల్లుదొర. తువ్వాలుతో ఒళ్ళంతా తుడుచుకున్నాడు.

రూపులమ్మ తక్కువ తినలేదు. తనూ అలాగే గుద్లురిమి చూసి “ఊఁ పట్టు” అంటూ గొడ్డలి చేతికందించింది. ఉస్సురంటూ లేచాడు మల్లుదొర. రెండు దెబ్బల్తో కసిగా తొలి బొంగుని పడగొట్టాడు. రూపులమ్మ మెచ్చుకోలుగా నవ్వుతూ భర్తకేసి చూసింది. మల్లుదొరలో కొంచెం ఉత్సాహం తొంగిచూసింది.

చలిజ్వరానికి మల్లుదొర ఒంట్లో వుంటం వల్ల ఏం సుఖంలేదు. మనిషిని తిప్పలు పెడదామని వచ్చిన జ్వరం తానే తిప్పలు పడుతోంది. ఇంకెంత తిప్పలు పడాలో అనే భయంతో జ్వరం పారిపోయినట్లుంది.

వెదురు నరుకుతున్న శబ్దాల్తో గాలి వేడిగా సంగీత సాధన చేస్తూ వుంది.

మల్లుదొర బొంగుల్ని నరకడంలో లీనమైపోయాడు. ఒక్కొక్క వెదురుపొదకీ ఆరేడు బొంగులు వెళుతున్నాయి. పొదకి మూడు బొంగులు అట్టిపెడుతున్నాడు. ఆ మూడు బొంగులు మూడేళ్ళలో మళ్ళీ నిండు పొదగా గుబురుకొస్తుంది.

రూపులమ్మ బొంగుల్ని కత్తితో సిలపడం చేస్తుంది. అయిదడుగుల సైజుకి కట్ చేస్తుంది. ఒక్కో బొంగులో రెండు సైజులు వెళుతున్నాయి. మిగిలిన పై సన్నని కొనముక్కని అలాగే పారవేస్తుంది. అది లాటుల్లో వేయడానికి ఒప్పుకోరు. వెదురునార చీరి ఎనిమిది తొమ్మిది బొంగుల కొక కట్ట కడుతోంది. మూడు రోజుల్నించి చేస్తున్న పని ఈ రోజుకి ఒక ‘లాటు’ కావాలని రూపులమ్మ తపన. లాటంటే అయిదు సి.యం.టీ. అంటే భూమి నుండి రెండున్నర అడుగుల ఎత్తు అయిదు అడుగుల పొడవు మూడు అడుగుల వెడల్పు.

లాటు పాసయితేగాని డబ్బు చేతికి రాదు. ‘పాస్’ అంటే వెరిఫై చేసి సర్టిఫై చేయడం. ఈ రోజుకి లాటూ పాసవుతుంది. పర్లేదు, బొంగులు కొట్టినకాడికి సరిపోతాయి అని నమ్మకంగా ఊపిరి పీల్చింది రూపులమ్మ. అప్పుడు మగనికి ఆకలి గురించి గుర్తుచేసింది. సద్ది విప్పింది.

మల్లుదొర ఆకలి ఎప్పుడో చచ్చిపోయింది. ప్రాణం సొలుగుతోంది. కడుపు లోతుకు పోయింది. అది దమ్ముతో వేగంగా కొట్టుకుంటోంది. అలసటగా అలా నీడలో ఒరిగాడు. వెన్నుకు ఏదో పొరక గుచ్చుకుంది. అయినా మళ్ళీ లేచే ఓపిక లేక అలాగే వుండిపోయాడు. కొంచెం సేపు రెస్టు తీసుకున్నాడు. ఆనక తిని అలా చుట్ట ముట్టించాడు. అంతే! “లే” రూపులమ్మ కేక వేసింది.

"కొండ కిందికి బొంగులు డ్రాగింగ్ చేద్దాం రావేమి?"

విసుక్కున్నాడు మల్లుదొర. 'దొంగ నంజ నన్ను చూసి ఓర్వదు. ఇలా ఒరిగానో లేదో పిలుపు." ఎట్టకేలకు లేవక తప్పలేదు.

బొంగు కట్టలు ఆ కొండ మీంచి కిందకు ఈడ్వాలి. రెండొందల గజాల దూరం ఈడ్వాలి. అక్కడ కొండ కింద లాటు పేర్చాలి. గబగబ పైకి కిందికి నడిచింది రూపులమ్మ. లాటు పేర్చారు, లాటుకు యింకా రెండు కట్టలు తక్కువైనాయి. మళ్ళీ మగన్ని లేవదీసింది. ఆ ఆత్రం చూసి సూపర్‌వైజర్ నవ్వాడు.

"ఈ రోజుకి లాటు సేసేద్దామనేటి?"

"ఈ జొరం రాకపోతే నిన్నటికే అయ్యేదండి బోబుగోరు."

"చెయ్యండి, చెయ్యండి!"

అక్కడున్న లాట్లన్నీ కొలుస్తున్నాడు సూపర్‌వైజర్. ఎవరి వర్కు వాళ్ళకు నోటు చేస్తున్నాడు. పాసింగ్ చేయడం పూర్తయ్యాక పార్వతి మొహంలో సంతోషం విప్పారింది. సూపర్‌వైజర్ మొహం అటు తిప్పుకున్నాడు. ఆమెని చూసినప్పుడల్లా తనకి జరిగిన అవమానం గుర్తొస్తుందతనికి. మరో లాటు కొలతలు తీసుకున్నాడు. ముకద్దం (గుమస్తా) అతనికి సాయం చేస్తున్నాడు. ముకద్దం ఏది ఎవరి లాటో వివరం చెబుతున్నాడు. బాగా పొద్దుపోయింది. ఎట్టకేలకు రూపులమ్మ తమ లాటు 'పాసింగ్' చేయించుకుంది. అప్పటికి అందరూ ఇంటికేసి మునుంపట్టారు.

కొండ దిగాక మల్లుదొర పూర్తిగా అలసిపోయాడు. ఒళ్ళంతా శవంలా బరువెక్కింది. పనిచేస్తున్నంతసేపూ భయపడ్డట్టు నటించిన జ్వరం మళ్ళీ తన ప్రతాపం ప్రదర్శిస్తూంది. కాళ్ళు చేతులు వణుకుతున్నాయి. చెట్టు నీడకు కూలబడిపోయాడు.

ఎప్పుడేం మాట్లాడాలో రూపులమ్మకు బాగా తెలుసులా ఉంది. చిలిపిగా కళ్ళతో వెక్కిరించింది. నల్లగా సొగసుగా నవ్వింది.

"అన్నలొచ్చేత్తారన్నావు. అలా తొంగొని పోయావేటి ?"

రూపులమ్మ హుషారివ్వడంతో ఈ రోజు అన్నలు ఎలాగైనా వస్తారని నమ్మకం కుదిరింది మల్లుదొరకు.

తొందరగా ఇల్లు చేరాలి. ఇప్పటికే అందరు చాలా ముందు వెళ్ళిపోయారు. ఒంటరిగా వెళ్ళడం అంటే తనకూ భయమే. కడుపునొప్పికి మందుగా తువ్వాలని కడుపుకి బిగదీసి కట్టుకుని గొడ్డలి తీసుకుని లేచాడు.

అదే పనిగా అరిచే పక్షుల రొద అప్పుడే మందగిస్తోంది. ఈ సమయం కోసమే ఎదిరిచూస్తున్నట్లుగా ఎలుగుబంట్లు, అడవి పందులు ఏటికేసి సాగుతున్నాయి.

రూపులమ్మతో నేనెక్కడ పోటీ పడగలనని సూరీడు పంతం మానేశాడు. ఓడిపోయిన ముఖంతో చల్లగా కొండ వెనక్కి జారుకుంటున్నాడు. చెట్ల చీకటి క్రీనీడలు ముసురుకుంటున్నాయి. చిరుతగండు వేటకి బయల్దేరినట్టుంది. పిల్ల జంతువులు పరిగెడుతున్నాయి. ఎండిన ఆకులు పరపర నలుగుతున్న ధ్వని. ఒంటరి మనుషుల వాసనవేసి ఆగిపోయింది చిరుత. ఒక్కసారిగా ఆకుల పరపర ధ్వని ఆగిపోయింది. నెత్తిమీద ఏదో ఠపీమని పడింది. ఏదో కాయ రాలింది. గుర్రుమంది చిరుత. తమ దరిదాపుల్లోనే ఆ శబ్దం వినిపించి అలసట మరిచి భయంతో పరుగులాంటి నడక అందుకుంది రూపులమ్మ.

❈ ❈ ❈

## 2. రూపులమ్మ చేతిలో చీకటి ఓడిపోయింది

అలసిపోలసి అడవి విశ్రాంతి తీసుకుంటోంది. చిమ్మెట్ల రొద హెచ్చింది. అడవిలో వెన్నెల ఆకుల సందుల్లోంచి వీలు చూసుకుని అడవంతా పర్చుకుంటోంది.

అప్పటికే అప్పడు ఇంటికి చేరవచ్చాడు. విల్లమ్ములతో ఆడుకుంటున్నాడు. బాణం గురితప్పడం లేదు. ప్రతిదీ ఎదురుగా వున్న చెట్లకి గుచ్చుతోంది. బాలవ్వ ఆనందంగా చప్పట్లు కొడుతోంది. తానూ నేర్చుకుంటానని వాడి చేతుల్లోంచి లాక్కోబోతోంది. వాడివ్వడం లేదు.

అలసిపోయిన మల్లుదొర మంచంలో వొరిగాడు. గెడ్డకెళ్ళి నీళ్ళు తెచ్చింది రూపులమ్మ. నీళ్ళు పొయ్యి మీద పెట్టి ఉఫ్ ఉఫ్ మని ఊదుతోంది. అంతలో బాణంలా దూసుకొచ్చింది బాలవ్వ. అన్నలొచ్చారంది. అంత అలసట జ్వరం ఎటూపోయిందో మల్లుదొర మంచంలోంచి ఒక్క ఉదటున లేచాడు.

"ఒక్కసనం ఉడుకునీల్లు తానంబోత్త" అప్యాయంగా అంది రూపులమ్మ. కాని ఆ మాట తన దగ్గరే మిగిలిపోయింది. అప్పటికే మల్లుదొర బయటకు వెళ్ళిపోయాడు. వెచ్చవెచ్చగా వేణ్ణిళ్ళతో తానే స్నానం చేసింది రూపులమ్మ. ఒళ్ళంతా చెమటలు పట్టి ఉప్పు దేలింది. బాగా చేత్తో రుద్దుకొంది. పొద్దున ఉతికిన చీర చుట్టుకుంది. ఈలోగా ఉడికిన అంబలి దించి అన్నలున్న యింటికేసి నడిచింది.

అప్పటికి వాళ్ళొచ్చి చాలాసేపే అయింది. ఎవరో టీ చేసి యిచ్చినట్టున్నారు. మంచం మీద కూర్చున్న అన్నలు మధ్య మధ్య మాట్లాడుతూ టీ తాగుతున్నారు. వాళ్ళకి పిడికిలి బిగించి సెల్యూట్ చేసింది రూపులమ్మ.

"బాగుంతిరా అన్నా?" అని పలకరించి పార్వతి పక్కన కూర్చుంది.

"బాగున్నారా అక్కా? ఏం విశేషాలు?" ప్రసన్నంగా పలకరించాడు సుధాకర్. అప్పటికే పెనిమిటి అన్నీ చెప్పి వుంటాడులే అన్నట్టు భర్తను చూసి నవ్వింది రూపులమ్మ.

"పోలీసులు మళ్ళీ వచ్చి ఏమైనా అల్లరి చేశారా? ఎవర్నైనా పట్టు కెళ్ళారా?" అందరికేసి కలియజుస్తు అడిగాడు సుధాకర్.

అన్నలు యింతకు క్రితం వచ్చి వెళ్ళిన్నుంచి జరిగిన విశేషాలన్నీ వివరించాడు రాజులబాబు. ఇవి మర్చిపోయావంటూ పార్వతి కొన్ని అందించింది.

"నా కోడి ఎత్తుకెల్లింది సెప్పలే" గుర్తుచేసింది రూపులమ్మ.

ఈ రోజు ఉదయం జరిగింది చెప్పుకొని అందరూ మరోసారి ఫెడీ ఫెడీన నవ్వుకున్నారు. ఈ విశేషాలన్నీ అయిపోయాక అందరికేసి కలియ చూశాడు సుధాకర్. ఎన్నో విషయాలు చెప్పుకొచ్చాడు.

"మనలాగే అక్కడ బస్తర్లో - అటు గఢ్‌చిరోలి, ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మంలో మనవాళ్ళు పేదోళ్ళ రాజ్యం కోసం పోరాడుతున్నారు. ఎనిమిదేండ్లుగా పోరాడుతున్నారు. ఇక్కడిలాగే అక్కడ పోలీసుల తిరుగుతున్నారు, కొడుతున్నారు, పట్టుకుపోతున్నారు. ఆడవాళ్ళను ఆగమాగం చేస్తున్నారు. ఇల్లు పీకేస్తున్నారు. మనుషులను చంపేస్తున్నారు. అయినా ఈ ఏడు ఎండాకాలంలో తునికాకు కూలీ పెంచుకోవడానికి సమ్మెలు చేశారు. పోలీసోల్లు అన్నల రానిస్తే మీ గతి యింతే అని యింకా రోజురోజుకు ఎక్కువ చేస్తున్నారు.

అంతా నిశ్శబ్దం. మరైతే అన్నలు రాకుంటే ఎలా? అన్నలు ఎక్కడికి పోతారు? తమ మంచి చెడ్డ చూసే దిక్కెవరు? వంటి ప్రశ్నలు వాళ్ళని చుట్టుముట్టాయి. రూపులమ్మ ఆ వూసే భరించలేకపోతోంది. ఉదయం అన్నలనో సారి తిట్టింది. అన్నలకు తెల్సిపోయిందో ఏమో? ఔను అన్నలకు అన్నీ తెలుస్తాయి. పశ్చాత్తాపంతో బాధతో కళ్ళలో నీళ్ళు సుళ్ళు తిరిగాయి. ఏం మాట్లాడాలో తెలియక పార్వతి బేలగా చూస్తోంది. అందరి పరిస్థితి అలాగే ఉంది. ఎవరినోటా మాట పెకలలేదు. ఒకరిద్దరు చుట్టలు ముట్టించారు.

ఎవరో పాలు తాగుతున్న పిల్లవాడు తల్లి రొమ్ము కొరికినట్టుంది. ఆ తల్లి పిల్లవాడి వీపు మీద ఒక్క చరుపు చరిచింది. పిల్లవాడు ఏడుపందుకున్నాడు. తల్లి ఇంకో రొమ్ము నోట్లో కుక్కింది, ఏడ్పు ఆగిపోయింది. అప్పుడు అన్నల తుపాకీ నిమిరి చూస్తున్నాడు.

అన్నల్లో మల్లిబాబు వచ్చి ఆ పిల్లవాన్ని తీసుకున్నాడు. ఎత్తుకుని ముద్దాడాడు. కితకితలు పెట్టాడు. పిల్లవాడు నడుంకున్న తూటాల 'పోచీ' కావాలన్నాడు.

సుధాకర్ మల్లిబాబుని పిలిచి సెంట్రీకి మారమన్నాడు. మల్లిబాబు ఆ పిల్లవాన్ని వెంకటరమణకిచ్చాడు. పిల్లవాడు రమణ అంగీ జేబులో చేతులు పెట్టాడు.

ముసలి తాత సుట్టను నిప్పువేపు నోట్లో పెట్టుకున్నాడు. తాపీగా పొగ పీలుస్తున్నాడు. సుధాకర్ చిరునవ్వు నవ్వాడు. లేచి చుట్ట తీసి నిప్పు బయటకు పెట్టి తాగమన్నాడు.

"మరి అన్నలు లేకుంటే మల్లి ఫారెస్టోల్లు, సావుకార్లు సంపుకతినరా"

"అన్నలు మన వెంట వున్నరు గనుకే కూలి పెంచింది ప్రభుత్వం. అన్నలు రాకముందు పెంచిందా? మరి అన్నలు రాకపోతే పెంచింది యిత్తరా? అది గూడ యియ్యరు. అన్నలే మన బలం అని తెలుసుకున్నారు. ఈ సారికి గిరిజనులు యింటికి యింత అని కొంత వసూలు చేసి యిస్తున్నారు అన్నలకు."

"ఎందుకేటి?" ఆశ్చర్యంగా అడిగింది రూపులమ్మ.

"ఎందుకంటావేటి? అన్నలు మనకు మందులియ్యలా? వాటికి డబ్బు కావాలా? ఆల్లకి మందుగుండు కావాలా? మరి తుపాకులు లేకపోతే పోలీసోల్లు అన్నలను బతకనిస్తరా?" అన్నాడు రాజులుబాబు.

మందుల పేరు వినగానే మల్లుదొర "ఔను కావాలి కావాలి. ఇపుడు నాకు మందుల్లేక ఎట్లయినానో సూడు" అన్నాడు రూపులమ్మ కేసి, అన్నలకేసి చూస్తూ కొన్ని టాబ్లెట్లిచ్చాడు సూర్యారావు.

"ఇంతకూ ఆల్లు అన్నల గురించి ఏటన్నారేటి?"

"మేం ఏమైనా సరే అన్నల విడువం అన్నారు" అన్నాడు సుధాకర్.

"అలా-అలా గుండాలె సంగం అంటె" ముసలితాత మెచ్చుకున్నాడు. అలా అదీ యిదీ చర్చ నడిచింది. అంతలో బుట్టతో అన్నిళ్ళు తిరిగి అన్నం వసూలు చేశాడు రాజులబాబు. అప్పుడు కూర, చారు, గంజి గిన్నెల్ని రాజులబాబు వెంట పట్టుకుని తిరిగాడు. గిన్నెలన్నీ నిండిపోయాయి.

"ఎప్పుడు తిన్నరో ఏమో, బేగి తినండి" అంటూ చర్చ ఆపుతూ ఆప్యాయంగా అవి ముందుంచారు గిరిజనులు. సుధాకర్ ముందు గంజి గిన్నె తీసుకున్నాడు. అన్ని రకాల గంజి కలిసి భలే రుచిగా వుంది. కొంత తాగి వెంకటరమణ కిచ్చాడు. రమణ కొంత తాగి సూర్యారావు కిచ్చాడు. సూర్యారావు కొంత తాగి తన పక్కనున్న సత్యం కిచ్చాడు.

మొత్తం అన్నం తినేసరికి భుక్తాయాసంగా వుంది. సత్యం చెవిలో సుధాకర్ ఏదో చెప్పాడు. సత్యంతో పాటు మల్లిబాబు అందరితో సెలవు తీసుకున్నాడు. ఆ ఇద్దరు అడవి కేసి నడిచారు.

దళంలో ఆ రోజు ముగ్గురే మిగిలిపోయారు అక్కడ. మామూలుగానైతే తొమ్మిది మంది వుండే దళం అది. సాధారణంగా గూడేల్లో రాత్రిళ్ళు పడుకోవడం మానేసి చాలా కాలమైంది. మరీ ముగ్గురే. అయినా సుధాకర్ అడవిలోకి వెళ్ళటానికే మొగ్గుచూపాడు. సూర్యారావు అనుమానం వెలిబుచ్చాడు. "అంత మంచిది కాదేమో, అడవి జంతువులొచ్చినా, ఆ వెధవలొచ్చినా చాలా కష్టం."

"అయితే ఏం చేద్దామంటావు ?"

"ఇక్కడే తొంగొండి. మేం సెంట్రీ సేత్తాం. ఎవుడత్తడో సూత్తాం." ధైర్యంగా అన్నాడు రాజులబాబు. రూపులమ్మ మల్లీ ఉదయపు ముచ్చట గుర్తు చేసింది. అందరూ మరోసారి నవ్వుకున్నారు. ఈసారి సీరియస్‌గా ముఖం పెట్టి అన్నాడు

రాజులబాబు. అవునా అన్నట్టు మల్లుదొర కేసి చూశాడు. టాబ్లెట్ వేసుకున్న ధైర్యంతో సంతోషంగా తల ఎగరేశాడు.

"నేనూ సేత్తానే"

అప్పుడు కూడా ముందుకొచ్చాడు. అలా అయిదారుగురు ఉండిపోయారు.

రాత్రి బాగా కావడంతో అందరూ ఇళ్ళలోకి వెళ్ళిపోయారు.

రూపులమ్మ బాలవ్వని పక్కలో వేసుకుని పడుకుంది. పొద్దంతా పని చేసిన అలసటతో ఒళ్ళంతా నొప్పులుగా ఉంది. ఈ రోజు దాదాపు ఇద్దరు చేసేంత పని చేసింది.

అటూ ఇటూ పొర్లింది. లేచివుట్టి మీంచి చీమలు దులిపి ఓ ఎండుచేప తీసుకుంది. దీపం ఆర్పేసి మంచంలో ఒరిగింది.

తిరిగి తిరిగి వచ్చిన సుధాకర్‌కి ఒళ్ళంతా నలతగా వుంది. ఇటీవల తిరగబెట్టిన అనారోగ్యం ఇంకా కుదుటపడలేదు. మంచంలోంచి లేచి కూర్చుండి పోయాడు. అటూ యిటూ చూశాడు.

గూడెం నిశ్శబ్దంగా ఉంది. అడివంతా అలజడి తగ్గి భయగంభీరంగా వుంది. ఏదో కుక్క యింకా తోకాడిస్తోంది. ఎక్కడివాళ్ళక్కడ గాఢనిద్రలో మునిగిపోయారు. ఆయుధం సరిచూసుకున్నాడు సుధాకర్. అది పొజిషన్‌లోనే ఉంది. అడవి. అడవిలో పల్లే, ఆ పల్లెలో తానొక్కడే సెంట్రీ. సుధాకర్ మనసులో కొన్ని గమ్మత్తయిన ఊహలు చెలరేగాయి. ఆ పల్లె విముక్తి ప్రాంతమయినట్టు, దానికి తను కమాండర్రై సెంట్రీ చేస్తున్నట్లు .... యిలా ఇంకెన్నో ...

ఏదో చప్పుడైంది. పెద్ద బావురుపిల్లి ఒకటి పరుగెత్తింది. తోకాడిస్తున్న కుక్క దాని వెంటాడింది. కోళ్ళ సంగతి దేవుడెరుగు ముందు ప్రాణం అనుకుంది అది. అడవిలోకి చెంగున గెంతి మాయమైంది.

లేచి నిటారుగా నిలబడ్డాడు సుధాకర్. సెంట్రీ చేస్తానన్న మల్లుదొర కేసి చూశాడు. అతను గుర్రు కొడుతున్నాడు. సూర్యారావు అతనికి జ్వరంతోపాటు ఒళ్ళునొప్పులకు కూడా టాబ్లెట్లు యిచ్చినట్టున్నాడు. దాంతో జ్వరం తగ్గి హాయిగా నిద్రపోతున్నాడు. సెంట్రీ చేస్తానని ఉబలాటపడ్డ అప్పుడు మట్టిలో కూర్చుని

మంచం కోడుకు తల ఆన్చాడు. అలసటగా అలాగే కునుకుతీస్తున్నాడు. రాజులబాబు నిద్రతో యుద్ధం చేస్తున్నాడు.

ఇంటి వెనుక చెట్టుమీద ఏవో పిట్టలు కొట్లాడుకుంటున్నట్టున్నాయి. కిచకిచమని వినిపిస్తూంది. ఎండిన ఆకుల్లోంచి ఏదో పాకుతూ వెళ్తోంది. స్ స్ మని శబ్దం వినిపిస్తోంది. ఇందాకా పరిగెత్తిన కుక్క తడికవద్దమన్న కుండ లోని నీళ్ళని గతుకుతున్న శబ్దం వినిసిస్తూంది.

గాలి వీస్తుంది. చెట్లు ఊగుతున్నాయి. బొఁయి మని వినిపిస్తూంది. ఆకులు గలగల రాలుతున్నాయి. గాలికి కొట్టుకొచ్చిన టేకు ఆకు రాజులబాబు ముఖం మీద పడింది. ఉలిక్కిపడి లేచాడు. ఎదురుగా సుధాకర్. సెంట్రీ చేస్తానన్న అందరికేసి చూశాడు రాజులబాబు. అందరూ గుర్రుకొడుతున్నారు. కళ్ళు నులుపుకొని ఆకాశం కేసి చూశాడు రాజులబాబు. స్నానం చేసి అలసటగా నిద్రపోతున్న పార్వతి శరీరంలా నిశ్శబ్దంగా వుంది. చుక్కలు పార్వతి కళ్ళలా మెరుస్తున్నాయి.

"సానా రాత్రయిపోనాది, తొంగో అన్నా. మేం సెంట్రీ సేత్తాంగా"

సుధాకర్ కళ్ళు మూతలు పడుతున్నాయి. మూడు రోజుల్నించి నిద్ర లేదు. పోలీసులు వెంటపడ్డంతో శివరాత్రి జాగరణైపోయింది. రాజులబాబు మాట సుధాకర్ వొంటికి పిల్లగాలిలా చల్లగా తగిలింది.

అయినా రెండడుగులు అటూయిటూ పచార్లు చేశాడు. కాళ్ళు కదలనంటున్నాయి. కళ్ళు చూడనంటున్నాయి. అయిదు నిమిషాలు అలా ఒరిగితే సరి. మళ్ళీ బలం వస్తుంది. అనుకొని టైం చూసుకున్నాడు. మంచంలో ఒరిగాడు. అందుకోసమే ఎదిరిచూస్తున్నట్టుగా అరనిమిషంలో కన్నంటుకుంది.

కోళ్ళు బెదిరిన అలికిడికి చటుక్కున లేచింది రూపులమ్మ. దీపం ముట్టించింది. బావురు పిల్లి గోడచూరు సందుల్లోంచి పారిపోయింది. చాపలఉట్టి కోళ్ళ గంపమీద పడింది. కోళ్ళు కెక్కెరమంటున్నాయి. దాన్ని తీసి యధాస్థానంలో ఉంచి బయటకు నడిచి తడక చాటుకు కూర్చుంది. లేచి తన మొగుడు ఎంత బాగా సెంట్రీ చేస్తున్నాడో చూద్దామని అటుకేసి చూసింది. ఎక్కడోళ్ళక్కడ హాయిగా నిద్రపోతున్నారు. వెన్నెల గుంకింది. అంతా చీకటిగా వుంది.

మనసు ఏదో కీడు శంకించింది. ఏదైనా జరిగితే అన్న ఆలోచనతో ఒళ్ళు గగుర్పొడిచింది. ఎవరినేనా లేపుదామనుకుంది. భయంతో అడుగు ముందుకు పడలేదు. అసలు చీకటంటే ముందే భయం – అందుకు తోడు ఎక్కడి వాళ్ళక్కడ నిద్రపోతున్నారు. అటూ యిటూ పరకాయించి చూసింది. పల్లె వెనకపక్కన ఏదో శబ్దం వినిపిస్తోంది .... చెవులు రిక్కించింది.

సందేహం లేదు. అది బూట్ల చప్పుడే. అడుగులో అడుగు వేస్తున్నట్టున్నారు, శబ్దం ఆగి ఆగి వినిపిస్తూంది. రూపులమ్మ గుండె వేగంగా కొట్టుకుంది. ఏంచేయాలో తోచక అరక్షణం మెదడు మొద్దుబారిపోయింది.

ఏవో ఆకారాలు రాజులబాబు పడుకున్న గుడిసె చూరుపక్కన కదిలినట్టయ్యాయి.

ఎట్లా వచ్చిందో ధైర్యం.. మగడు పడుకున్న మంచంకేసి నడిచింది.

"బేగి.. బేగి... లెగు... దొంగలు.. దొంగలు"

ఒక్క ఉదటున లేచాడు మల్లుదొర.. లేచి రాజులబాబును లేపాడు. రాజులబాబు సూర్యారావును లేపాడు.

"యెయ్యి–యెవ్" అన్న శబ్దంతో పాటు ఎవరో డొక్కలో పొడిచినట్టయి ఉన్న పళంగా నిద్రలేచి ఆయుధం పొజిషన్‌లో పట్టుకున్నాడు సుధాకర్.

అరక్షణం ఆలస్యమయితే ఎంతపని జరిగేది.

పల్లె అంతా అలజడిగా వుంది. కర్రల చప్పుడు, విల్లమ్ములనాదం వినిపిస్తూంది. ఎవరో గొడ్డల్ల దెబ్బల్ని గాలికి విసురుతున్నారు.

"యెయ్.. యెయ్" అన్న గొంతులు మూడు పక్కల్నించి వినిపిస్తూన్నాయి.

పోలీసులు ఒక రౌండ్ పేల్చినట్టున్నారు. కంయ్యిమని శబ్దం చేస్తూ సుధాకర్ మెడ పక్కనించి గుళ్లు దూసుకుపోయాయి.

"అన్నలు... అన్నలు" ఆతృతగా అందరు అటుయిటూ పరుగెడుతున్నారు. మంచాలు ఖాళీగా ఉన్నాయి. పోలీసులు పట్టుకున్నారా? ఎక్కడ.. ఎటు వెళ్ళారు?.. ఆతృత.. ఒకటే ఆతృత..

సూర్యారావుకి, వెంకటరమణకి సైగ చేసి గుడిసె పక్క సందులోకి ముందుకు

కదిలినట్టయింది. వాళ్ళు పదిహేను ఇరవై మంది దాకా ఉన్నట్టున్నారు.

డిఫెన్సు పొజిషన్ చూసుకుని ఒక రౌండు పేల్చినట్టున్నాడు సుధాకర్. 'ఢాం' అన్న పెద్ద ధ్వనితో పల్లె అదిరిపోయింది.

పోలీసులు డిఫెన్సు పొజిషన్‌కోసం వెనక్కి తగ్గినట్టున్నారు. కొందరు లేయింగ్‌లో వున్నట్టున్నారు. యెయ్.. యెయ్ అన్న అరుపులు మరింత ఎక్కువయ్యాయి.

గుడిసె చాటు నించి వెనక్కి తప్పుకున్నట్టున్నారు ముగ్గురు.. అలా అయిదు గుడిసెలు చుట్టి పోలీసులు పల్లె చుట్టుముట్టిన దారి వెంట వెనకకి నడిచి చెట్టు చాటు నుంచి పల్లెకేసి చూశాడు సూర్యారావు. సాభిప్రాయంగా సుధాకర్‌కేసి తిరిగాడు.

అక్కణ్ణించి కాల్చితే అయిదుగురు పోలీసులు తమ రేంజిలోకి వస్తారు. అయినా వద్దని సైగ చేశాడు సుధాకర్. వాళ్ళని చంపడం ముఖ్యం కాదు. తాము తప్పుకోవడమే ముఖ్యం.

పోలీసులు రెండు రౌండ్లు ఆ గుడిసెకేసి కాల్చినట్టున్నారు. "యెయ్.... యెయ్" అన్న అరుపులు, మధ్యమధ్యలో "అన్నలు.. అన్నలు.. ఎక్కడ" అన్న అరుపులు.

అక్కడ్నించి కుడివేపుకి తిరిగారు. ఆ పొద పక్కనే ఇంకో టీం మాటువేసి నట్టుంది. ఏదో అలికిడయ్యింది.

వడివడిగా నడిచారు ముగ్గురు.

తమ వెనక బూట్ల టకటకలు అంతకంతకు పెరుగుతున్నాయి. చింతల కొండకేసి తిరిగారు. ఈ పొదలచాటునా ఆ పొదలచాటునా నక్కుతూ వుండిపోయారు.

మళ్ళీ పోలీసులు రెండు రౌండ్లు కాల్చినట్టున్నారు. కంయ్యిమని అడవి మోత పెట్టోంది. ఎక్కడో పడుకున్న జంతువులు ఆదరాబాదరాగా పరిగెడ్తున్నాయి.

ఎడం పక్కనించి వాళ్ళు వస్తున్న శబ్దం వినిపిస్తూంది. ఏదో లొద్దిలా వుంది. కుడిపక్కకి అడుగులు వేశారు. ఏదో శ్వాస వినిపిస్తోంది. అటుకేసి చూశారు. అయిదు గజాల దూరంలో ఎలుగుబంటు నల్లగా చీకటిలో కలిసిపోయి ఇటుకేసి చూస్తోంది.

వడివడిగా తప్పుకున్నారు. అలా అలా అడవిలో కలిసిపోయారు. బూట్ల శబ్దం దూరమైపోయింది.

అటూ యిటూ వెతికిన పోలీసుల ఎదురుగా ఎలుగుబంటి. చకచకా తప్పుకుని ముందుకు సాగారు. ఏమీ కన్పించడం లేదు. ఏమీ విన్పించడం లేదు. చేతికి చిక్కినట్టే చిక్కి మాయమైపోయారు. అడవి సన్నాసి వెధవలకి ఎంత ధైర్యం వచ్చింది... వాళ్ళని తప్పించేశారు. వడివడిగా మళ్ళీ పల్లెవైపు నడిచారు.

కుక్కలు మొరుగుతూనే వున్నాయి. పల్లె అంతా సందడిగా వుంది. అన్నలు తప్పుకున్నారో.. పట్టుబడ్డారో సందిగ్ధంగా వుంది.

ఆకాశం నిర్మలంగా వుంది. వెన్నెల వున్నంత సేపూ మసగ్గా వున్న చుక్కలు చీకట్లో మిలమిల మెరుస్తున్నాయి. ఆ గూడెంలో మళ్ళీ కలకలం లేచింది.

ఒక్క ఉదటున ఇరవై మంది పోలీసులు పల్లె మీద పడ్డారు. కసిగా బాదుతున్నారు. మళ్ళీ ఏంజరుగుతుందో అర్థం అయ్యేసరికి ఎక్కడివాళ్ళక్కడ దెబ్బలు తింటూ అరుస్తున్న కేకలతో పల్లె ప్రతిధ్వనిస్తోంది.

గుడిసెల్లో పడుకున్న వాళ్ళు విల్లమ్ములు ఎక్కుపెట్టారు. కర్రలు విసిరారు. ఎవడో పోలీసు – "సచ్చాన్రో బాబో" అని అరుపు విన్పించింది. అలాగే మళ్ళీ.. మళ్ళీ విన్పించాయి.

ఇరు పక్షాలకీ సంకుల సమరం సాగుతున్నట్టుంది. అరుపులు కేకలతో అడవంతా ప్రతిధ్వనిస్తోంది.

ఎవరో కంకబద్దల్ని కాగడాలుగా అంటించినట్టున్నారు. అప్పటికి ఆ పల్లె యుద్ధభూమిగా మారిపోయింది.

ఓడిపోయి చిక్కుబడ్డ యుద్ధఖైదీలుగా ఇరవై మంది పోలీసుల్ని అరెస్టు చేశారు జనం. ఇరవై తుపాకులు కిందపడి ఉన్నాయి.

పార్వతి కర్రతో ఒక్కొక్కడినీ వాయగొడుతోంది.

"నన్నెలా చేశారు! మమ్మల్ని ఎలా కొట్టారు.. టేషన్ కి తీసికెల్లి" కసిగా తిడుతోంది.

"తప్పయింది బాబో"

"ఊc మమ్మల్ని మాతోటే కొట్టిత్తారు గదా.. నువ్వు ఈడిని లెంపకాయ కొట్టు.. ఊc" రూపులమ్మ వాళ్ళ బెల్టు ఊడబీకి దాంతోనే దంచుతోంది. పోలీసులు ఒకడినొకడు కొట్టుకోక తప్పింది కాదు.

రాజులబాబు వాళ్ళ బూట్లని విప్పేసి అందులో కాళ్ళు పెట్టుకొని "మమ్మల్ని ఇట్లాగేగా తన్నింది. ఊc.." అంటూ ఎగిరెగిరి తన్నాడు.

ఆడవాళ్లంతా పోలీసుల షర్టులు విప్పదీయించారు. "మమ్మల్ని యిలాగే గదా తొంగోబెట్టారు. ఊc.." అంటూ బెల్టులతోనూ, చేతికందిన కర్రలతోనూ బాదుతున్నారు.

"ఇట్టాగేగా నన్ను లెంపకాయ కొట్టిందీ" గాజులు ఫెళ్ళు మనేట్టు వెదురు నరికినంత కోపంగా చెంపపెట్టు వేసారొకరు.

"అమ్మో.."

"సమించు తల్లో.."

"నా గోసి వూడబీకి వురికించినావు గందా!" మల్లుదొర పోలీసువాడి పిర్రలు వాయగొడుతున్నాడు.

ఒక్కరేమిటి–ఆడవాళ్ళు, పిల్లలు అందరు తమని అంతకాలం దాకా కొట్టిన దెబ్బలకి, చిత్రహింసలకీ ప్రతీకారం తీర్చుకుంటున్నట్టున్నారు.

"మల్లోసారి మా ఊల్లోకొత్తారా.."

కొండచీపురుతో మొహంమీద దంచింది రూపులమ్మ.

బస్కీలు తీయించారు. బూట్లని వాళ్ళమీదికి విసురుతున్నారు. ఎవరో వెదురుకర్రతో కసిగా బాదుతున్నారు.

అప్పుడు ఎగిరెగిరి వాళ్ళ జుట్టుపట్టి పీకాడు.

"ఇట్టాగే గదా నా చెంప కొరికిందీ" ఎవరో స్త్రీ పోలీసువాడి చెంపల్ని గోళ్ళతో రక్కుతోంది.

ఎవరో కాండ్రకిచ్చి మొహంమీద ఉమ్మారు.

"మా అన్నల్ని సంపుతారా యింక"

"నాకు తెలియదు బాబో"

"నంజకొడుకు ఎట్లున్నడో సూడు. అన్నల్ని పట్టుకుందామని మల్లోసారి అత్తారా?"

"తప్పయిపోయింది బాబో. వామ్మో"

"మల్లెపుడయినా మా పల్లె వేపు వత్తారా?"

"రాను.. రాను.. అమ్మో"

ఊరంతా పండగ చేసుకుంటున్నట్లు సంతోషంతో అరుపులతో నిండి పోయింది. కోళ్ళకి ఆ సంతోషం ఆగినట్టులేదు. గంప కిందనుంచే కొక్కొరకో అని కూస్తున్నాయి.

అడవిలో పిట్టలు అదేదో వింత పండగని చూడ్డానికి గిరికీలు కొడుతున్నాయి. ఆ పూట ఎముకలకి కొరతలేదని కుక్కలు అటూ యిటూ పరుగెడుతున్నాయి.

ఏదో వింతగా తూర్పు కొండమీంచి పొద్దు నిక్కినిక్కి చూస్తోంది. ఇవి ఆ కాయకష్టం చేసే చేతులేనా ? అమాయకులనుకున్నానే. ఆశ్చర్యపోయాడు సూరీడు.

చెట్లకి కట్టేయబడ్డ ఇరవైమంది పోలీసులు అలాగే నిద్రలో జోగుతున్నారు. వాళ్ళ కాళ్ళదగ్గరే తుపాకులు పడున్నాయి. తప్పిపోయిన మరో పోలీసు దళం వెతుక్కుంటూ అక్కడికి చేరింది. ఆ కోలాహలం కనులారా చూశారు. వణికి పోయారు. రెండు చేతులు జోడించి దండం పెట్టారు. అక్కడక్కడ విసిరి వేయబడ్డ బట్టల్నీ, డ్రస్సుల్నీ, రైఫిళ్ళనీ ఒక్కచోట కుప్పేశారు. ఎన్ని విధాల కోరితే అన్ని విధాల క్షమాపణలు చెప్పారు. ముక్కు భూమికి రాశారు. అందరూ కలిసి క్యాంపు కేసి పారిపోయారు.

రైఫిళ్ళు ఎత్తుకుపోయి దాచుకోనందుకు పోయిన ఉద్యోగం మళ్ళీ వచ్చినంత సంతోషం కూడా వాళ్ళలో వున్నట్టుంది.

మల్లుదొర గొడ్డలి పదును బెడుతున్నాడు. నిద్రలేమి, నిస్సత్తువ ఎక్కడికో పారిపోయాయి. అప్పుడు మంద పక్కనే విల్లమ్ము లాగి పోలీసును కట్టేసిన ఓ

చెట్టుకేసి వదులుతున్నాడు. బాలవ్వ ఉరికి ఉరికి దాన్ని వూడబీకి మళ్ళీ అన్నకు అందిస్తూంది.

తన శక్తేమిటో మొదటిసారిగా తెలిసివచ్చింది రూపులమ్మకు. సంతోషంతో కాలు నిలవడం లేదు. తన కూతురు బాలవ్వలా ఎగరాలని వుంది. కాని పనికి వెళ్ళాలి. వేళవుతోంది. పొయ్యిమీద అంబలి కుండ దించింది.

ఉత్సాహంగా పార్వతిని కేకేసింది. ఇద్దరూ నిన్నటికీ నేటికీ తేడా తలపోస్తూ నవ్వుకుంటూ గెడ్డకేసి నీళ్ళకోసం సాగిపోయారు.

మాటల్లో రాబోయే పరిణామాల గురించి భయంతో పార్వతి ఏదో అంది. రూపులమ్మ భయపడి అంతలోనే తేరుకుంది.

ఇంకో గంటలో అయిదు వందల మంది పోలీసు పటాలం తమ మీదికి రాబోతుందని వారికి తెలియదు.

జేవురించిన మొహాన్ని కూడదీసుకుని మళ్ళీ నవ్వింది పార్వతి. రూపులమ్మ శృతి కలిపింది. ఆ నవ్వుల్లో సంతోషమే కాదు, అమాయకత్వమూ వుంది. దాన్ని మించుతున్న కసీవుంది.

కథ యిక్కడితో అయిపోలేదు. ఇది యింతటితో ఆగేది కాదు. నిజమైన బతుకుపోరుకి యిది నిజమైన ప్రారంభం.

**కథాకాలం 1985.**
**అరుణతార మాస పత్రిక.**
**అడవిలో వెన్నెల-2 పేరుతో - జూన్ 1987**